క్లుప్తంగా

ఎస్‌కేవీటీలో నేడు జాబ్ మేళా

సీటీఆర్ఐ: స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫాక్స్ కాన్ కంపెనీ ఆధ్వర్యంలో గురువారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రమణమూర్తి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళ అభ్యర్థులకు మాత్రమే ఇందులో పాల్గొనే అవకాశం ఉందని వాళ్లు డిగ్రీ అర్హత ఉన్న లేకపోయినా ఇంటర్వ్యూ హాజరు కావచ్చున్నారు. ఈ అవకాశాన్ని ప్రతి విద్యార్థిని ఉపయోగించుకోవాలని తెలిపారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరం ఈఈ7 శాటిలైట్ సిటీ సెక్షన్ పరిధిలో విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుంది. ఈ విషయాన్ని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శ్యామ్యూల్ బుధవారం తెలిపారు. పోలీస్ క్వార్టర్స్, తారకరామానగర్, బాలాజీ నగర్, రూప నగర్, ఫ్యూచర్ కిడ్స్ స్కూల్ ఏరియా, కవలగొయ్యి, పిడింగొయ్యి గ్రామం, పిండింగోయ్యి పంచాయతీ పరిధిలో అగ్రికల్చర్ లైన్స్‌కు కొన్ని ప్రాంతాలలో కరెంట్ ఉండదన్నారు.

రైల్వే ఇనుప గడ్డర్‌పై పడిన భారీ చెట్టు


రైల్వే ఇనుప గడ్డర్‌పై పడిని భారీ చెట్టు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమండ్రి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలోని రైల్వే ఇనుపగడ్డర్‌పై భారీ చెట్టు కూలింది. ఈ చెట్టు రైలుబ్రిడ్జి ఇనుపగడ్డరకు మధ్యన పడింది. ఈ చెట్టు కొమ్మలు కింద వెళ్తున్న వాహనచోదకులపై పడుతుందని ఆందోళన చెందుతున్నారు. కావున వెంటనే అధికారులు స్పందించి పడిపోయిన భారీ చెట్టును తొలగించాలని కోరుతున్నారు.

శ్యామల సెంటర్‌లో సిల్టు తొలగింపు


డ్రైనేజీలలో సిల్టును తొలగిస్తున్న పారిశుధ్య సిబ్బంది

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమండ్రి శ్యామలసెంటర్‌లో బుధవారం ఉదయం నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశాల మేరకు శానిటరీ సూపర్‌వైజర్-1 ఇంద్రగంటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పారిశుధ్య సిబ్బంది సిల్టును తొలగించారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీలోకి పారిశుధ్య సిబ్బంది దిగి ప్లాస్టిక్ సీసాలు, కవర్స్, గ్లాసులు, మద్యం బాటిల్స్‌ను తీశారు. ప్రజలకు నగరపాలక సంస్థ అధికారులు డ్రైనేజీల్లో ప్లాస్టిక్ వస్తువులు వేయవద్దని అవగాహన కల్పిస్తున్నప్పటికీ వారిలో మాత్రం ఎటువంటి మార్పు రావడం లేదు.

విశ్వబ్రాహ్మణులకు ఎమ్మెల్సీ కేటాయించాలి


పాడుగు శ్రీను

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరం సిటీ: విశ్వబ్రాహ్మణుల సంక్షేమానికి శాసన మండలిలో గళం విప్పేందుకు ఆ సామాజిక వర్గానికి ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు, ఏపీ విశ్వబ్రాహ్మణ సంఘం యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పాడుగు శ్రీను బుధవారం రాజమహేంద్రవరంలో విజ్ఞప్తి చేశారు. విశ్వబ్రాహ్మణులు తగినంత పనులు లేకపోవడంతో నిరాదరణకు గురవుతున్నారని, నూతన ప్రభుత్వం విశ్వబ్రాహ్మణుల సంక్షేమం కోసం గళం వినిపించేందుకు ఒకరికి ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని కోరారు. చేతి వృత్తుల వారిపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆలోచన చేయాలని కోరారు. చేతిపనులు లేక విశ్వ బ్రాహ్మణులు ఆవేదనలు, సమస్యలు వినిపించడానికి ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని కోరారు.

ఆర్థిక సాయం అందజేత

కడియం: జేగురుపాడు గ్రామానికి చెందిన నాగిరెడ్డి సత్తిబాబుకు టీడీపీ నాయకులు డాక్టర్ గోరంట్ల రవిరామ్‌కిరణ్ బుధవారం రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. బ్రెయిన్ స్ట్రోక్‌తో సత్తిబాబు మంచానికే పరిమితమై, కనీసం ప్రభుత్వం నుంచి పెన్షన్ కూడా పొందలేకపోతున్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో కూటమి నాయకులతో కలిసి రామ్‌కిరణ్ అతడిని మెడికల్ రిపోర్టులు పరిశీలించారు. సంబంధిత వైద్యులతో మాట్లాడారు. మందులు అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు. అలాగే సత్తిబాబుకు మండల బీజేపీ నాయకులు 5 వేలు ఆర్థిక సాయాన్ని బుధవారం అందజేశారు. అతడికి పెన్షన్ ఇప్పించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో బొరుస సుబ్రహ్మణ్యం, ఆకుల శ్రీధర్, చిక్కాల శ్రీను, తాతబాబ్బాయి, దాసరి ముత్యం, లోవరాజు, రామచంద్రరావు పాల్గొన్నారు.

అందరి చూపు.. సోలార్ వైపు..

- కూటమి ప్రభుత్వంలో కరెంట్ చార్జీల షాక్
- యూనిట్ రేట్లు పెంచిన సర్కార్
- తక్కువ ఖర్చుతో సౌర వెలుగులు
- ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్ట్ బిజిలి యోజన
- సబ్సిడీ అందిస్తున్న కేంద్ర ప్రభుత్వం


డాబాపై ఏర్పాటు చేసిన సోలార్ ప్యానల్స్

సీటీఆర్ఐ: వేసవి వచ్చేసింది. వేడిమి పెరుగుతోంది. ఉక్కపోత కారణంగా ప్రతి ఇంట్లో ఫ్యాన్, ఏసీ తిరుగుతూనే ఉంటోంది. దీంతో కరెంట్ వినియోగం అధికమవుతోంది. కూటమి ప్రభుత్వం వచ్చి పది నెలలు అవుతున్నా ఏ ఒక్క సంక్షేమ పథకం అమలు చేయలేదని గానీ ప్రజలపై కరెంట్ చార్జీల మోతను మోగించింది. ప్రభుత్వం సంపద సృష్టిస్తానంటూ కరెంట్ యూనిట్ రేట్లు పెంచి ప్రజల నడ్డి విరగ్గొడుతోంది. దీంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు కరెంట్ బిల్ రాగానే గుండె గుబేల్‌మంటోంది. వందల స్థాయి నుంచి వేల రూపాయల కరెంట్ బిల్లులు రావడంతో సామాన్యులు లబోదిబోమంటున్నారు. దీంతో చాలా మంది సోలార్ వెలుగులపై మక్కువ చూపుతున్నారు.

పెరిగిన విద్యుత్ వాడకం

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో విద్యుత్ వాడకం పెరిగింది. దీంతో ఏసీ, ఫ్రీజ్‌లు, ఫ్యాన్లు వాడకం విపరీతంగా పెరిగిపోయింది. విద్యుత్ బిల్లులు చెల్లించేందుకు పేద ప్రజలకు పెను భారంగా మారింది. రూ.10 వేలు, రూ.12 వేలు విద్యుత్ బిల్లులు చెల్లించే వినియోగదారులు, సోలార్ ఎనర్జీ ని వినియోగించడం ద్వారా కేవలం 3 వేలకు విద్యుత్ బిల్లులు తగ్గించకోవచ్చు. కాలుష్యాన్ని తగ్గించేందుకు పవన విద్యుత్తు, సోలార్ విద్యుత్తుతోనే కాలుష్యాన్ని అరికట్టవచ్చు. ఎండలు, వెలుతురు ఎక్కువగా ఉండే మన ప్రాంతంలో సోలార్ ఎనర్జీకి అన్ని రకాలుగా సౌకర్యంగా రాజమహేంద్రవరం బాగా అభివృద్ధి చెందడంతోపాటు నగరం విస్తీర్ణం పరిధి కూడా పెరుగుతోంది. దానవాయిపేట, ప్రకాష్ నగర్, తిలక్‌రోడ్డు, జేఎన్ రోడ్డు, ఏవీ అప్పారావు రోడ్డు వంటి ప్రాంతాలలో పలు షాపింగ్ మాల్స్, రెస్టారెంట్లు, ఆసుపత్రులు, కాలేజీలు ఎక్కువగా ఏర్పాటు చేస్తున్నారు. ఇటువంటి వాణిజ్య ప్రధాన షాపులలో ఇప్పుడు అందరూ సోలార్ ఎనర్జీ వైపు దృష్టి సారిస్తున్నారు. డొమెస్టిక్ తోపాటు, కమర్షియల్ కూడా విద్యుత్ యూనిట్ స్లాబ్ సిస్టమ్ మారడంతో విద్యుత్ బిల్లును తట్టుకోలేని పరిస్థితిలో ఉన్నారు. దీనితో వారంతా సోలార్ ప్యానల్స్ ఏర్పాటు వైపు మొగ్గు చూపుతున్నారు.

పీఎం సూర్యఘర్ యోజనలో సబ్సిడీ

ప్రధాని నరేంద్ర మోదీ సౌర విద్యుత్‌ని ప్రోత్సహించడానికి పీఎం సూర్యఘర్ యోజనలో సబ్సిడీ అందజేస్తున్నారు. రాబోయే రోజుల్లో బొగ్గు కొరత వంటి పరిస్థితులను అధిగమించడానికి సౌర విద్యుత్‌ను ప్రోత్సహించడం అనివార్యమవుతుంది. వినియోగం పెరిగితే, సోలార్ పానెల్స్ ధరలు కూడా తగ్గుతాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు. 3 కిలో వాట్ కెపాసిటీకి ఒక్కొక్క కిలోవాట్‌కి రూ.18 వేలు వరకు సబ్సిడీ వస్తుంది. పది కిలోవాట్ కెపాసిటీకి రూ1,17,00 సబ్సిడీ అందుతుంది.

సంపూర్ణ మద్దతు ఇస్తాం



రాజమహేంద్రవరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఏర్పాటు చేసిన ప్రేయర్ ఎనర్జీలో సోలార్ ప్లాంట్లకి కావాల్సిన అన్ని అందుబాటులో ఉన్నాయి. గత 11 ఏళ్లుగా తమ సంస్థ పనిచేస్తోంది. ఒక మెగావాట్ సౌర విద్యుత్‌కి 60 నుంచి 70 వేల రూపాయలు ఖర్చు అవుతుంది. కేంద్ర ప్రభుత్వం నుంచి 30 వేల రూపాయల వరకు సబ్సిడీ ఇస్తుంది. అయితే మెగావాట్లు పెరిగే కొద్దీ ప్రయోజనం ఎక్కువ ఉంటుంది. సౌర విద్యుత్ అమర్చుకోడానికి పదేళ్ల కాల పరిమితికి బ్యాంకు రుణాలు కూడా ఇస్తుంది. ఈఎంఐ ద్వారా రుణం తీర్చుకోవచ్చు. రుణం కూడా వెంటనే మంజూరవుతుంది. సోలార్ ప్యానెల్స్ బిగించడం దగ్గర నుంచి సబ్సిడీ వచ్చే వరకు అన్ని కార్యకలాపాలు సంస్థే నిర్వహిస్తోంది.

– రాధిక చౌదిరి, ప్రేయర్ ఎనర్జీ డైరెక్టర్

25 నుంచి 30 ఏళ్ల ప్రయోజనం



సౌర వ్యవస్థలో పెట్టుబడి పెట్టడం 25 నుంచి 30ఏళ్ల వరకు ప్రయోజనం పొందవచ్చు. రాజమండ్రిలోని అనుభవ కేంద్రాలతో, కస్టమర్లకు నేరుగా మద్దతు ఇవ్వడానికి, స్వచ్ఛ విద్యుత్ దిశగా పరివర్తనను సులభతరం చేయడానికి స్థానిక కార్యకలాపాలను బలోపేతం చేస్తున్నాం. కరెంట్ బిల్లులు తగ్గడం ద్వారా మూడు నాలుగేళ్లలోనే పెట్టిన పెట్టుబడి రికవరీ అయిపోతుంది.

– సౌరబ్ మార్గా, ప్రేయర్ ఎనర్జీ ఎండీ

ఆర్ట్స్ కళాశాలలో అకడమిక్ ఆడిట్ బృందం పర్యటన

కంబాలచెరువు: ఆంధ్రప్రదేశ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నియమించిన విద్యా నిపుణుల బృందం 2023-24, 2024-25 విద్యా సంవత్సరాలకు అకడమిక్ ఆడిట్ నిర్వహించడానికి ఆర్ట్స్ కళాశాలకు విచ్చేసిందని ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే బుధవారం తెలిపారు. ఈ బృందం మూడు రోజుల పాటు ఆడిట్ నిర్వహిస్తుందని, దీనిలో ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ డాక్టర్ కె.విజయబాబు, అకడమిక్ ఆఫీసర్లు డాక్టర్ టి.జాన్ కిరణ్, డాక్టర్ ఇ.వరప్రసాద్ ఉన్నారన్నారు. కళాశాల చేసిన విద్యా, పరిశోధన, విస్తరణ, సామాజిక, ఇతర కార్యకలాపాలను ఈ ముగ్గురు నిపుణులు నిశితంగా పరిశీలిస్తారన్నారు. మరికొద్ది నెలల్లో ప్రభుత్వ కళాశాల న్యాక్ ఇన్‌స్పెక్షన్‌కు వెళ్లవలసి ఉన్న నేపథ్యంలో ఈ అకడమిక్ ఆడిట్‌కు అత్యంత ప్రాధాన్యత ఉందన్నారు. గత రెండు సంవత్సరాలుగా కళాశాలలో చేపట్టిన అకడమిక్ అభివృద్ధి కార్యక్రమాల సవివరంగా ప్రజంటేషన్‌ను బృంద సభ్యులకు చేశామన్నారు. అనంతరం ఈ బృందం కళాశాలలోని ఐక్యూఏసీ, అకాడమిక్ సెల్‌తో పాటు కొన్ని విభాగాలను సందర్శించి, వాటిలో చేసిన కార్యక్రమాల రికార్డులను పరిశీలించారన్నారు.

రంజాన్ పవిత్ర మాసం


ఇఫ్తార్ విందులో పాల్గొన్న విశ్వేశ్వరరెడ్డి

రాజమహేంద్రవరం సిటీ: ముస్లింలు పవిత్రంగా భావించే రంజాన్ మాసం నిబద్ధతకు మరో రూపమని కాంగ్రెస్ జిల్లా కమిటీ అధ్యక్షుడు డాక్టర్ టీకే.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. రంజాన్ మాసం సందర్భంగా బుధవారం రాజమహేంద్రవరం మెయిన్ రోడ్డులోని పెద్ద మసీదులో జరిగిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాజమహేంద్రవరం సిటీ కాంగ్రెస్ ప్రెసిడెంట్ అబ్దుల్లా షరీఫ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు అసదుల్లా అహ్మద్, ఆల్ ఇండియా యూత్ కాంగ్రెస్ మాజీ సెక్రటరీ ఎస్‌కే హర్షద్, రాయల్ మాస్క్ ప్రెసిడెంట్ ఎస్‌కే కరీం, రాయల్ మాస్క్ మాజీ అధ్యక్షుడు కరీం ఖాన్, కాంగ్రెస్ నాయకులు ఖాదర్ షరీఫ్, ముస్లిం సోదరులు, పెద్దలు, ఇమామ్‌లు పాల్గొన్నారు.

వాసు సేవలు అభినందనీయం


వైఎస్సార్ సీపీ కార్యకర్తల ప్రమాదబీమా నమూనాను విడుదల చేస్తున్న చెల్లుబోయిన వేణు, జక్కంపూడి రాజా, చందననాగేశ్వర్ తదితరులు

మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ

రాజమహేంద్రవరం రూరల్: వైఎస్సార్ సీపీ మండల ఉపాధ్యక్షుడు యెజ్జు వాసు అనునిత్యం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తూ, పార్టీ కార్యకర్తలకు బీమా సౌకర్యం కల్పించడం అభినందనీయమని మాజీమంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. యెజ్జు వాసు జన్మదినం సందర్భంగా బుధవారం కాతేరు గ్రామంలో వైభవ్ ఫంక్షన్ హాల్లో ఉచిత వైద్యశిబిరం, వృద్ధులకు చీరల పంపిణీ, కార్యకర్తలకు పోస్టల్ ప్రమాద బీమా బాండ్లు ,సైకిల్‌కిట్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలను చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా చేతుల మీదుగా ప్రారంభించారు. ఈసందర్భంగా చెల్లుబోయిన వేణు మాట్లాడుతూ యెజ్జు వాసు పుట్టినరోజు సందర్భంగా నమ్ముకున్న సిద్ధాంతాలతో ముందుకు వెళుతూ పార్టీకి అండగా నిలుస్తున్న 200 మందికి రూ.10లక్షల ప్రమాద బీమా చేయించడం అభినందనీయమన్నారు. మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ యెజ్జు వాసు పుట్టినరోజు సందర్భంగా ఎటువంటి ఆర్భాటాలకు వెళ్లకుండా సేవా కార్యక్రమంలు చేపట్టడం అభినందనీయమన్నారు. ఈసందర్భంగా యెజ్జు వాసును శాలువాతో ఘనంగా సత్కరించారు. ఉచిత వైద్యశిబిరం అనంతరం రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటీఫికేషన్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ చందన నాగేశ్వర్, మండలపార్టీ అధ్యక్షుడు ఉప్పులూరి వీర వెంకట సత్యనారాయణలు మాట్లాడారు. యెజ్జు వాసు మాట్లాడుతూ పార్టీకి అండగా నిలుస్తున్న కార్యకర్తలకు తనవంతు సాయంగా 200 మందికి రూ.10లక్షల ప్రమాదబీమాను చేయించామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ముద్దాల అను, ఆచంట కల్యాణ్, మండలంలోని పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వం శక్తి యాప్‌తో సాధించింది ఏదీ లేదు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మార్తి లక్ష్మి

- మహిళలంటే టీడీపీకి గౌరవం లేదు
- జగనన్నను విమర్శించే అర్హత లేనే లేదు
- వైఎస్సార్ సీపీ నగర మహిళా అధ్యక్షురాలు మార్తి లక్ష్మి

రాజమహేంద్రవరం సిటీ: మహిళల రక్షణకు భరోసా కల్పిస్తూ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన దిశ యాప్ పేరు మార్చేసి శక్తి యాప్ తెచ్చిన కూటమి ప్రభుత్వం సాధించింది లేదీ లేదని వైఎస్సార్ సీపీ నగర మహిళా అధ్యక్షురాలు మార్తి లక్ష్మి ధ్వజమెత్తారు. బుధవారం వైఎస్సార్ సీపీ సిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వానికి మహిళలంటే ఏ మాత్రం గౌరవం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ పాలనలో దిశ యాప్ ద్వారా ఒక కాల్ చేస్తే పరుగెత్తుకొచ్చి, రక్షణ ఇస్తారనే నమ్మకం ఉండేదన్నారు. దిశ యాప్‌తో జగనన్నకు మంచి పేరు వస్తోందన్న ఉద్దేశంతో పేరు మార్చేసి శక్తి యాప్ అంటున్నారని విమర్శించారు. దిశ యాప్ పెట్టి మొబైల్ ఫోన్ చేతితో ఊపేస్తే మహిళలకు రక్షణ వచ్చేసినట్లా అని హోమ్ మంత్రి అనిత వ్యాఖ్యానించడం శోచనీయమన్నారు. తిరుపతిలో ముగ్గురు అమ్మాయిలను కిడ్నాప్, పిఠాపురంలో ఓ మహిళపై అత్యాచారం జరిగితే మీ శక్తి యాప్ ఎక్కడికి వెళ్లిందని ప్రశ్నించారు. హోమ్ మంత్రి నియోజకవర్గంలోనే ఓ మహిళను కిడ్నాప్ చేసి తీసుకుపోయిన ఘటన ఇప్పటికీ ఏమైందో కూడా తెలియలేదన్నారు. దిశ యాప్ పేరు మార్చి శక్తి యాప్ పెట్టేముందు కనీసం మహిళల రక్షణ గురించి ఆలోచించలేదన్నారు. జగనన్నను విమర్శించడానికి టీడీపీకి కనీస అర్హత లేదన్నారు. జగన్ పెట్టిన దిశ యాప్ మహిళలకు గుండె ధైర్యం ఇచ్చిందని ఇప్పుడు ఆ పేరు మార్చి వారి ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఇప్పటికీ దిశ యాప్ వలన రక్షణ కలుగుతోందన్నారు. జగనన్న చెప్పిన ప్రతిపనీ చేశారని, హామీలు అన్నీ నెరవేర్చారన్నారు. అధికారం కోసం ఎన్నో హామీలు ఇచ్చిన కూటమి ప్రభుత్వం ఒక్క హామీ అయినా నెరవేర్చలేకపోయిందన్నారు. మహిళలపై గౌరవం లేదని, తిరిగి నాకు కొడుకు ఉన్నాడు, నీకు ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు అంటూ చివరకు పసి పిల్లలనుద్దేశించి సిటీ ఎమ్మెల్యే కామెంట్లు చేయడం దారుణమన్నారు. మానవీయత లేకుండా మాట్లాడిన ఇలాంటి ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మజ్జి నూకరత్నం, పార్టీ నాయకులు వి.కృష్ణవేణి, మార్గాని సుశీల, అనురాధ, సత్య కుమారి తదితరులు పాల్గొన్నారు.

'నన్నయ'లో ఉచిత వైద్య శిబిరం

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ, సెంట్రల్ లైబ్రరీలో బుధవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ ప్రారంభించారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ శిబిరంలో విద్యార్థులు, అధ్యాపకులతోపాటు వీసీ కూడా కంటి పరీక్షలు చేయించుకున్నారు. రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రి, డాక్టర్ అగర్వాల్ కంటి ఆస్పత్రి, శ్రీవాణి దంత వైద్యశాల వైద్యులతోపాటు స్థానిక జీఎస్ఎల్ వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు అందజేశారు. ఎన్ఎస్ఎస్ యూనిట్-2 ఆధ్వర్యంలో ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, అధ్యాపకులు డి.జ్యోతిర్మయి, పి.వెంకటేశ్వర్రావు, ఎస్.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి చర్యలు

కమిషనర్ కేతన్ గార్గ్


పనులు పరిశీలిస్తున్న కమిషనర్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం సిటీ: నిత్యం రద్దీగా ఉండే కంబాలచెరువు జంక్షను పరిసర ప్రాంతాలలో ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని కమిషనరు కేతన్ గార్గ్ పేర్కొన్నారు. బుధవారం నగరంలోని వివిధ జంక్షన్లలో ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించే చర్యల్లో భాగంలో కంబాలచెరువు మదర్ థెరీస్సా పార్కు పరిసరాలను ట్రాఫిక్ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించారు. మదర్ థెరీస్సా పార్క్ చుట్టూ వాహనాల రద్దీ లేకుండా రాకపోకలు సులభతరం చేసే విధంగా త్వరలో ట్రాఫిక్ పోలీస్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక తయారు చేస్తామన్నారు. కార్యాచరణ ప్రణాళికలో ట్రాఫిక్ వ్యవస్థను మెరుగు పరిచే చర్యలు, వాహనాల పార్కింగ్ సౌకర్యాల పెంపు తదితరాలు ఉంటాయన్నారు. ట్రాఫిక్ రూల్సు పాటించుటలో ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. మదర్ థెరీస్సా పార్క్ చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉన్న ఆక్రమ ఆక్రమణలను తొలగించి, వీధి వ్యాపారులను సక్రమంగా పునరావాసం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. పార్క్ పరిసర ప్రాంతాల సుందరంగా మెరుగుపరిచేందుకు, పార్కింగ్ సౌకర్యాలను సమకూర్చేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అక్రమ ఆక్రమణల తొలగింపు, కూడలి అభివృద్ధి విజయవంతంగా నిర్వహిస్తామని అందుకు ప్రజలు సహకరించాలని కమిషనర్ కోరారు. పార్కును ప్రత్యేక అభివృద్ధి నిధి నుంచి రూ.75 లక్షలు రుడా నిధులు రూ.50 లక్షలతో అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే 90 శాతం పనులు పూర్తయ్యాయని మిగిలిన పనులను నెలలో పూర్తిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజినీర్ ఎంసీహెచ్ కోటేశ్వరరావు, సిటీ ప్లానరు జి.కోటయ్య, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మదర్‌షా ఆలీ, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు ప్రసాద్, అసిస్టెంటు ఇంజినీర్ పి.ప్రసాద్, ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళికా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికి ఈకేవైసీ తప్పనిసరి


సమావేశంలో మాట్లాడుతున్న ఏఎస్‌వో నాగాంజనేయులు

రాజమహేంద్రవరం రూరల్: రేషన్ కార్డులో ఉన్న కుటుంబ సభ్యులందరూ ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని జిల్లా పౌర సరఫరాల శాఖ ఏఎస్‌వో నాగాంజనేయులు అన్నారు. బుధవారం బొమ్మూరులోని రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ పీవీవీ జయసూర్యకుమార్ అధ్యక్షతన రేషన్‌డీలర్ల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఏఎస్‌వో నాగాంజనేయులు మాట్లాడుతూ మిస్సింగ్ ఈకేవైసీ డేటా అంతా తమ గ్రామంలో ఉన్న రేషన్ డీలర్ల వద్ద ఉంటుందన్నారు. కుటుంబంలో ఉన్న కొంత మంది సభ్యుల డేటా ఈకేవైసీ అవ్వలేదని, ఈవిషయంపై ప్రజలందరికీ అవగాహన కల్పించి వారం రోజుల్లో ఈకేవైసీ పూర్తి చేయించుకునేలా చర్యలు తీసుకోవాలని రేషన్‌షాపు డీలరు, ఎండీయూ ఆపరేటర్, స్థానిక వీఆర్‌వోలను ఆయన కోరారు. తహసీల్దార్ జయసూర్యకుమార్ మాట్లాడుతూ ఈకేవైసీ అయిన కుటుంబసభ్యులకు మాత్రమే రేషన్ వస్తుందని, అవ్వని వారికి రేషన్ రాదని పేర్కొన్నారు. రూరల్ ఎంఎస్‌వో ప్రభాకరరావు మాట్లాడుతూ త్వరలో పాతరేషన్‌కార్డుల స్థానంలో స్మార్ట్ పీడీఎఫ్ కార్డులు ప్రభుత్వం ఇవ్వబోతుందన్నారు. అందులో క్యూఆర్ కోడ్ ద్వారా ఈకేవైసీ అయిన కుటుంబసభ్యులకు మాత్రమే రేషన్ ఇస్తుందన్నారు. కుటుంబంలో ఉన్న ప్రతి ఒక్కరూ ఈకేవైసీ చేయించుకోవాలని ఆయన కోరారు. ఈసమావేశంలో రేషన్‌డీలర్లు, ఎండియూ ఆపరేటర్లు, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

షాపు ఖాళీ చేయాలంటూ దౌర్జన్యం!

పోలీస్‌లను ఆశ్రయించిన బాధితులు



తాము నిర్వహిస్తున్న హోటల్ వద్ద బేబీ శ్యామల, సురేష్

కడియం: తాము నిర్వహిస్తున్న హోటల్‌ను తక్షణం ఖాళీ చేయాలంటూ సదరు భవన యజమాని, మరికొందరు తమపై దౌర్జన్యం చేసి, కులం పేరుతో దూషించారని పినిపే బేబీ శ్యామల, సురేష్ దంపతులు తెలిపారు. ఈ మేరకు కడియం పోలీస్‌లకు ఫిర్యాదు చేస్తున్నట్లు బుధవారం స్థానిక విలేకరులకు చెప్పారు. తమకు రావాల్సిన బాకీలను వసూలు చేసుకునేంత వరకు సమయం ఇవ్వాలని కోరినప్పటికీ, వారు పట్టించుకోకుండా తమపై దౌర్జన్యంగా వ్యవహరిస్తున్నారన్నారు.

స్కూల్ నుంచి వెళ్లిపోయిన విద్యార్థుల తల్లిదండ్రులకు అప్పగింత


విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఇన్‌స్పెక్టర్ కాశీవిశ్వనాథ్

రాజమహేంద్రవరం రూరల్: కేరళ చూద్దామని స్కూల్ నుంచి వెళ్లిపోయిన ఇద్దరు విద్యార్థులను బొమ్మూరు పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హుకుంపేట రామకృష్ణనగర్‌కు చెందిన అడ్డగర్ల సూర్యారావు, రాజమండ్రి సీతంపేటకు చెందిన నవగాని మనోజ్ సెయింటాన్స్ స్కూల్లో ఐదో తరగతి చదువుతున్నారు. బుధవారం మధ్యాహ్నం పాఠశాల విడిచిన తరువాత ఇద్దరు ఇంటికి వెళ్లకుండా కేరళ చూడడానికి వెళదామని వెళ్లిపోయారు. పాఠశాల వదిలిన ఎంతసేపటికి ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు పాఠశాలలో విద్యార్థులు ఆచూకీ కోసం తెలుసుకోగా ఇంటికి వెళ్లిపోయినట్టు సమాచారం ఇచ్చారు. దీంతో బొమ్మూరు పోలీసులను ఆశ్రయించారు. బొమ్మూరు పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కాశీవిశ్వనాథ్, ఎస్సై, సిబ్బంది రైల్వేస్టేషన్ తదితర ప్రాంతాల్లో గాలించగా ఇద్దరు విద్యార్థులు దొరికారు. వెంటనే వారిద్దరిని స్కూల్‌కు తీసుకువచ్చి ఇన్‌స్పెక్టర్ కౌన్సెలింగ్ ఇచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. ఇద్దరు వెయ్యి రూపాయలు సేకరించి కేరళ చూడడానికి వెళదామనుకుని వెళ్లామని పోలీసులకు తెలపారు.

సచివాలయ కార్యదర్శులకు ఉద్యోగోన్నతి

కడియం: మండలంలోని నలుగురు సచివాలయ గ్రేడ్-5 కార్యదర్శులకు, గ్రామ పంచాయతీ గ్రేడ్-4 కార్యదర్శులుగా ఉద్యోగోన్నతి లభించింది. కాకినాడ జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం జరిగిన కౌన్సిలింగ్‌లో దామిరెడ్డిపల్లి కార్యదర్శి బొర్రా ప్రభాకర్‌ను రాజానగరం మండలం నామవరం పంచాయతీ కార్యదర్శిగా నియమించారు. అలాగే వేమగిరి సచివాలయం 3 కార్యదర్శి డేగల పాపారాయుడును అల్లూరి సీతారామరాజు జిల్లా గంగవరం మండలం సూరంపాలెం పంచాయతీకి, కడియం సచివాలయం-4 కార్యదర్శి ఎల్.శివబాబును కూనవరం మండలం రేగులపాడు పంచాయతీకి, కడియం సచివాలయం-కార్యదర్శి ఎస్.నాగమల్లిని కూనవరం మండలం కూటూరు గ్రామ పంచాయతీ కార్యదర్శులుగా నియమించారు. పదోన్నతులు పొందిన వీరిని పలువురు అభినందించారు.

మద్యం తాగి వాహనం నడిపిన ముగ్గురికి జైలు

మరో 29 మందికి రూ.2 లక్షల 90 వేలు జరిమానా

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): మద్యం సేవించి వాహనం నడిపిన ముగ్గురు వ్యక్తులకు జైలు శిక్ష విధిస్తూ ఏజేఎఫ్‌సీ మెజిస్ట్రేట్ సి.రమ్య బుధవారం తీర్పునిచ్చారు. ట్రాఫిక్ ఇన్‌చార్జి డీఎస్పీ కె.రమేష్‌బాబు ఆధ్వర్యంలో డివిజన్‌లో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. దీనిలో ఇద్దరు వ్యక్తులకు రెండు రోజుల జైలు, ఒక వ్యక్తికి మూడు రోజుల జైలు శిక్ష విధించారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించాలని ఉద్దేశంతో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో తాగి వాహనం నడుపుతున్న వాహనదారులకు డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించి 32 కేసులను నమోదు చేశారు. 29 మందికి ఒకొక్కరికి రూ.10 వేలు చొప్పున రూ.2లక్షల 90 వేలు జరిమానా విధించారు.

సినిమాలు



శ్యామల	: దిల్‌రుబా
సూర్యమినీ	: కింగ్‌స్టన్, తండేల్
సూర్యప్యాలెస్	: దిల్‌రుబా
స్వామి	: కోర్ట్
శివజ్యోతి	: ఆఫీసర్ ఆన్ డ్యూటీ
అనుశ్రీ	: శబ్దం
రాజా	: అగత్యా
ఊర్వశి	: కోర్ట్
మేనక	: 1000వాలా, సంక్రాంతికి వస్తున్నాం
రంభ	: మజాకా
కుమారి	: రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్
అప్సర	: యుగానికి ఒక్కడు, మాయాబజార్
అశోక నామవరం	: చావా
వీఎస్.మహల్ ధవళేశ్వరం	: దిల్‌రుబా
మురళీకృష్ణ కడియం	: చావా,కోర్ట్
వెంకటసూర్య	: కోర్ట్